క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కడప అర్బన్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాల రికార్డులు వుంటేనే డ్రైవింగ్ చేయాలని కడప ఒన్‌టౌన్ సీఐ ఎస్.వి నాగరాజు తెలియజేశారు. సోమవారం సాయంత్రం సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. లైసెన్స్, వాహనాల రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించారు.

పేద విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కోర్సులు

కడప ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని వర్గాల ఓసీ పేద విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కోర్సులు తక్కువ ఖర్చుతో అందించేందుకు ఓసీ సంఘం ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని ఓసీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కందనూరు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. సాఫ్ట్‌వేర్ కోర్సులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సబ్సిడీతో అందుబాటులోకి తెచ్చేందుకు కేవీఎం సొల్యూషన్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. సోమవారం బెంగుళూరుకు చెందిన కేవీఎం టెక్ సొల్యూషన్స్ ప్రతినిధులు భాస్కర్, సుదర్శన్, సుబ్బారెడ్డి, గిరీష్‌లతో సమావేశమై చర్చించినట్లు తెలిపారు. లెనెక్స్, అడ్మిన్, అజూర్, ఆటోమేషన్ టెస్టింగ్, జావా, ఎస్‌ఏపి, అబాస్ కోర్సులకు మార్కెట్‌లో ఉన్న విలువ కన్నా 70 శాతం సబ్సిడీతో విద్యార్థులకు అందిస్తామని ముందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కోర్సులలో చేరాలనుకునే ఓసీ సంఘం విద్యార్థులు 9491797624కు వివరాలను పంపి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కంచర్ల భాస్కర్, సుదర్శన్, ట్రైనర్లు సుబ్బారెడ్డి, గిరీష్ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

వల్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పలు శాఖలపై సమీక్ష నిర్వహించి చర్చిస్తామని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు పూర్తి స్థాయి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఆమె కోరారు.

స్పందన సమస్యలను పరిష్కరించాలి

చెన్నూరు : స్పందన కార్యక్రమానికి వచ్చే సమస్యలను వలంటీర్లు గుర్తించి సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటిని వెంటనే పరిష్కరించేలా చూడాలని తహసీల్దార్ పఠాన్ అలీ ఖాన్, ఎంపీడీఓ గంగనపల్లి సురేష్ బాబు తెలిపారు. సోమవారం వారు చెన్నూరు పాత బస్టాండ్ లోని గ్రామ సచివాలయం-2 లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలు ఏవైనా అధికారుల దృష్టికి వచ్చిన వెంటనే వాటిని వెంటనే పరిష్కరించాలని, ఒకవేళ మీకు సాధ్యపడని సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సచివాలయ సిబ్బందికి తెలియజేశారు. ఏపీఎం గంగాధర్, మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, ఉపాధి హామీ సుధారాణి, అంగన్వాడి సూపర్‌వైజర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాల భైరవాష్టమి పూజలు


పూజలు చేస్తున్న మహిళలు

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని ఎంఎస్ కొట్టాల గ్రామంలో సోమవారం శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి ఆలయంలో కాలభైరవాష్టమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీధర్‌శర్మ తొలుత మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామికి విశేష అలంకారం చేశారు. ఆలయం వెలుపల భక్తులు ప్రత్యేక పూజలను సామూహికంగా నిర్వహించారు. అనంతరం భక్తులు కుష్మాండ దీపాలతో స్వామికి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు, బాసట స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు మేరువ బాలాజీరావు, కార్తీక్‌రెడ్డి తదితరులు పూజలను పర్యవేక్షించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు వేగవంతం చేయండి

రైల్వేకోడూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు వేగవంతం చేయాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి నాటి నుంచి విద్యా, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీఎం వైఎస్ జగన్‌కు అభివాదం తెలుపుతున్న శివ-శివానీ స్కూల్ విద్యార్థులు


కడప నగరంలోని రాజీవ్ పార్క్ వద్ద సీఎం వైఎస్ జగన్‌కు అభివాదం తెలుపుతున్న అభిమానులు

జై జగన్.. జైజై.. జగన్..

జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోమవారం కడప నగరంలో పర్యటించారు. రాజీవ్‌మార్గ్, రాజీవ్ పార్క్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎంను చూడడానికి ప్రజలు భారీ స్థాయిలో తరలివచ్చారు. రాజీవ్ మార్గ్ ప్రాంతమంతా జనం పోటెత్తారు. జై జగన్.. జై..జై.. జగన్.. అంటూ నినాదాలు చేశారు. ముఖ్యంగా వివిధ పాఠశాలల విద్యార్థులు థ్యాంక్యూ.. సీఎం జగన్ మామయ్యా.. అంటూ నినదించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం ఆయన నాయకులతో మమేకమయ్యారు.




సీఎం వైఎస్ జగన్‌ను తమ సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసుకుంటున్న విద్యార్థినులు

అభినందన

కడప కార్పొరేషన్: రాజీవ్ పార్కును ప్రారంభించేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చిన్నారులు నృత్యంతో స్వాగతం పలికారు. ముద్ర డ్యాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు సాన్వి చైతన్య, అవంతిక, నిఖితలు చేసిన నృత్యం అలరించింది. చిన్నారులను ముఖ్యమంత్రి అభినందించి వారితో ప్రత్యేకంగా ఫొటో దిగారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : హార్స్ రైడింగ్‌లో ప్రతిభ చూపుతున్న చిన్నారులను సీఎం వైఎస్ జగన్ అభినందించారు. అలంఖాన్ పల్లె దండువద్ద గల విస్డమ్ పాఠశాలలో చదువుతున్న పాణ్యం యశస్విని, నాగజ్యోతి లు హార్స్ రైడింగ్‌లో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఈ మేరకు వారు సోమవారం సీఎంను కలువగా ఆయన చిన్నారులను అభినందించారు.


సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులతో..


హార్స్ రైడింగ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినులను అభినందిస్తూ..


సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా


సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

కడపలో సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం


కడప కార్పొరేషన్ : జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఇడుపులపాయ హెలీప్యాడ్ నుంచి కడప ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, మేయర్ సురేష్ బాబు, జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు సి. రామచంద్రయ్య, ఎంవీ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డిలు ఘనంగా స్వాగతం పలికారు.

కడప విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు


మూడు రోజుల జిల్లా పర్యటన ముగించుకుని విజయవాడకు బయలుదేరిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సోమవారం కడప విమానాశ్రయంలో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఇడుపులపాయలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి సోమవారం మధ్యాహ్నం 2.05 గంటలకు విమానంలో కడప ఎయిర్‌పోర్టు నుంచి గన్నవరానికి బయలుదేరి వెళ్లారు. ముఖ్యమంత్రితోపాటు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఓఎస్‌డీ కృష్ణమోహన్‌రెడ్డిలు ఉన్నారు.

– కడప విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికిన వారిలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియాఖానమ్, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజు, ఏఎస్పీలు తుషార్‌డూడి, ప్రేరణకుమార్, కడప మేయర్ సురేష్‌బాబు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీలు డీసీ గోవిందరెడ్డి, సి.రామచంద్రయ్య, ఎంవీ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, డాక్టర్ సుధ, డాక్టర్ సుధీర్‌రెడ్డి, వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఉద్యాన సలహాదారు శివప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్


కడప మేయర్ సురేష్‌బాబు


పరిశ్రమల సలహాదారు రాజోలు వీరారెడ్డి


ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి


జెడ్పీటీసీ నరేన్‌రామాంజుల్ రెడ్డి


డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి


కడప కమిషనర్ ప్రవీన్‌చంద్


సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, తదితరులు

వైవీయూ అభివృద్ధి నిధుల కోసం సీఎంకు వినతి

– ముఖ్యమంత్రికి విన్నవించిన వీసీ, రిజిస్ట్రార్
– సీపీ బ్రౌన్ కేంద్రానికి రూ.6.87 కోట్లు విడుదలపై ధన్యవాదాలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైవీయూ అధికారులు కలిసి విన్నవించారు. సోమవారం కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు విచ్చేసిన ముఖ్యమంత్రిని వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వీసీగా అవకావం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంకు రూ. 6.87 కోట్లు నిధులు విడుదల చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధి పనుల కోసం రూ. 40 కోట్లు నిధులు ఇవ్వాలని కోరారు. విశ్వవిద్యాలయంలోని పరిపాలనభవనం, మేనేజ్‌మెంట్ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయని వాటి కోసం రూ. 17 కోట్లు, స్థలసేకరణకు రూ. 8 కోట్లు, కాన్వొకేషన్ హాల్‌కు రూ. 6 కోట్లు, ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి రూ. 2 కోట్లు, ప్రహరీ కోసం రూ. 7 కోట్లు అవసరమవుతాయని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి విశ్వవిద్యాలయ అవసరాలు చూడాలంటూ కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సూచించారు.

కడప కల్చరల్ : రాయలసీమ నాలుగు జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలను కలుపుకుని గ్రేటర్ రాయలసీమ పరిధిలో బలిజలకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని శ్రీకృష్ణ దేవరాయ బలిజ అభ్యుదయ సేవా సమితి (బాస్) వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి శివప్రసాద్ సీఎంను కోరారు. కడప నగరంలో బలిజ సంక్షేమ భవనానికి స్థలం కేటాయించాలని, ఈడబ్ల్యుఎస్ కోటాలో ఐదు శాతం ప్రత్యేకంగా విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించాలని కోరారు.


సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వై.పి. వెంకటసుబ్బయ్య

సీఎంకు వినతులు అందజేత

కడప కార్పొరేషన్: జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పలువురు వినతులు అందజేశారు. కడప నగరంలోని పలు అంశాల గూర్చి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ సీఎంకు విన్నవించారు.

– వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా దళిత, గిరిజన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సంబంధించిన రాయితీలను విడుదల చేయాలని దళిత్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(డిక్కీ) జిల్లా కో ఆర్డినేటర్ ఓబిలి శంకర్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించారు.

– ఏపీఐఐసీ ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఇస్తున్న భూమిని రెండెకరాల్లోపు ఉంటే ఔట్ రేట్ సేల్ (ఓఆర్‌ఎస్) లేదా 99 లీజు పద్ధతిలో ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ సీఎంను కోరారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో నూతన పారిశ్రామిక పాలసీకి సంబంధించిన గైడ్‌లైన్స్ విడుదల చేయాలని కూడా కోరారు.

– చింతకొమ్మదిన్నె మండలం మామిళ్లపల్లెలోని అలీమాసాదియా ముస్లిం గర్ల్స్ ఆర్గనైజేషన్ భూమి సమస్య పరిష్కరించాలని 28వ డివిజన్ కార్పొరేటర్ షేక్ అరీఫుల్లా బాషా సీఎంను కోరారు.

పాత కలెక్టరేట్‌ను మ్యూజియంగా మార్చాలి

కడప కల్చరల్: కడప నగరంలోని పాత కలెక్టరేట్ భవనాన్ని ఆధునీకరించి స్టేట్ ఆర్కియాలజీ మ్యూజియంగా మార్చాలని ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. సీఎం నగర పర్యటనలో భాగంగా సోమవారం హెలిప్యాడ్ వద్ద ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన ముఖ్యమంత్రి ఆ దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయ రామరాజుకు సూచించారు.

ఆర్ట్స్ కళాశాల అనుబంధ వసతిగృహాలకు వినతి..

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలకు అనుబంధ వసతిగృహాలను పునరుద్ధరించాలని కడప ఆర్ట్స్ కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి లయన్ కె. చిన్నపరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కోరారు. సోమవారం కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ముఖ్యమంత్రిని కలిసి ఈ మేరకు ఆయన వినతిపత్రం అందజేశారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే సీఎం లక్ష్యం

– చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని ప్రజలు చెప్పుకునే విధంగా పులివెందులలో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. తిరుపతిలో కూడా పులివెందుల తరహాలోనే అభివృద్ధి చేసే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం పులివెందులలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న సిటీ ఫారెస్ట్ రాణి తోపు, గరండాల్ వంకను ఆయన పరిశీలించారు. తుడా బీసీ హరికృష్ణ, సెక్రటరీ లక్ష్మీ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పల్లకీలో ఊరేగిన భద్రకాళీ సమేతుడు



రాయచోటిటౌన్ : రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు కూడా అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగురంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢవీధులలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవ ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అటవీ సంపద పరిరక్షణ అందరి బాధ్యత

– రేంజర్ కళావతి

సిద్దవటం: అటవీ సంపద అయిన ఎర్రచందనం తరలి పోకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని రేంజర్ కళావతి తెలిపారు. సిద్దవటం రేంజిలోని పంచలింగాలు, శ్రీ నిత్యపూజస్వామి కోన అటవీ ప్రాంతాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఆలయ సిబ్బందికి సూచించారు. పంచలింగాల వద్ద వన్యప్రాణులను దృష్టిలో పెట్టుకొని అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. అనంతరం ఆలయ అర్చకులు సుబ్రమణ్యంశర్మ, చైర్మన్ కొండారెడ్డి ఆలయ సంప్రదాయాలతో రేంజర్‌కు స్వాగతం పలికారు. భక్తుల సౌకర్యాలపై ఆమె ఆలయ చైర్మన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేసు, బీటు అధికారులు, ఏబీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాట్ల పనులు పరిశీలన

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని కడప రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవనం ఆవరణలో నూతనంగా దివంగత సీఎం డాక్టరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహ ఏర్పాట్లు పనులు పూర్తి చేయాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం విగ్రహ ఏర్పాటు పనులతో పాటు మున్సిపల్ భవనం , పబ్లిక్ హెల్త్ భవనం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యర్రగుంట్ల వాసి, సాక్షి ఫైనాన్స్ డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డి దాతృత్వంతో వైఎస్సార్ విగ్రహంను అత్యంత సుందరీకరణంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే విగ్రహం ఏర్పాటుకు ఫౌండేషన్ అయిందన్నారు. చుట్టు ప్రహరీతో పాటు గ్రీనరీ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెలలోనే విగ్రహప్రారంభోత్సవంతోపాటు, మున్సిపల్ భవనం, పబ్లిక్ హెల్త్ భవనంను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డితో పాటు కో-ఆప్షన్ సభ్యులు డి సూర్యనారాయణ రెడ్డి, కౌన్సిలర్ ఎరిలకరెడ్డి, యర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

క్రికెట్ స్టేడియంను అందుబాటులోకి తీసుకొస్తాం

సంబేపల్లె: రాయచోటి పట్టణ సమీపంలోని నక్కావాండ్లపల్లె వద్ద నిర్మితమవుతున్న క్రికెట్ స్టేడియం పనులను త్వరగా పూర్తి చేయించి అన్ని హంగులతో స్టేడియంను అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మోటకట్ల గ్రామం వంగిమల్లవాండ్లపల్లెలో సర్పంచ్ రాధిక, వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ పోటీలు సోమవారం ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌ను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి తిలకించారు. తొలుత వారు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని తెలిపారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కాగా ఈ పోటీల్లో సురేష్ కెప్టెన్సీలో మోటకట్ల టీం విన్నర్స్‌గా, ఈశ్వర్‌రెడ్డి కెప్టెన్సీలో చిన్నమండెం టీం రన్నర్స్‌గా నిలిచాయి.